సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 12 । ఏప్రిల్ । 2024



కాలువల ద్వారా నీటి విడుదల

శ్రీరాంసాగర్ నుంచి కాకతీయ, లక్ష్మి, సరస్వతి కాలువలకు ఆఖరి తడి కోసం గురువారం నీటి విడుదల ప్రారంభించారు.

- 8లో ▸



నిబంధనలు గాలికి..

రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలు పాటించకుండా వెంచర్లు వేసి అమాయకులకు ప్లాట్లు అంటగడుతున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.1 /23.9

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతం అవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉంది. జిల్లాలోని పలుచోట్ల జల్లులు కురియవచ్చు.

న్యూస్‌రీల్

పూలేకు ఘన నివాళి



సుభాష్‌నగర్: మహాత్మ జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జ్యోతిబాపూలే సేవలు, మహిళల విద్యాభివృద్ధి కోసం ఆయన కొనసాగించిన కృషిని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్ని తహసీల్దార్ సస్పెన్షన్



వర్ని: వర్ని తహసీల్దార్ మోతీసింగ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఎడపల్లి నుంచి ఇటీవల వర్నికి బదిలీపై వచ్చిన మోతీసింగ్ వాల్టా బ్యాంకు ఖాతా నుంచి ఆర్డీవో, కలెక్టర్ అనుమతి లేకుండా డబ్బులు డ్రా చేసి సొంతానికి వాడుకున్నారని ఆరోపణలు వచ్చాయి. విచారణ చేపట్టిన అధికారులు ఆరోపణలు వాస్తవమే అని గుర్తించారు. మొరం, ఇసుక రవాణాకు వే బిల్లుల కింద వచ్చే నగదు, అక్రమ రవాణాకు విధించే జరిమానాల ద్వారా వచ్చే ఆదాయం వాల్టా బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. ఈ ఖాతా నుంచి మోతీసింగ్ రూ.3.55 లక్షలు డ్రా చేసి సొంతానికి వాడుకున్నాడని తెలియడంతో విచారణ చేపట్టి సస్పెండ్ చేశారు.

హిందువులపై నిజమైన ప్రేమ చూపాలి

- 'చాయ్ పే చర్చ'లో ఎంపీ అర్వింద్



సుభాష్‌నగర్: ఎమ్మెల్సీ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి హిందువులపై నిజమైన ప్రేమ చూపాలని, ఎన్నికల సమయంలోనే వ్యాఖ్యలు చేయొద్దని బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. గురువారం ఉదయం నగరంలోని దుబ్బ చౌరస్తాలోగల బద్రి హోటల్‌లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, స్థానిక కార్పొరేటర్ పంచరెడ్డి ప్రవళిక శ్రీధర్‌తో కలిసి చాయ్ పే చర్చ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు దేశంలో మోదీ, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఆవశ్యకతను వారి అభిప్రాయాల ద్వారా తెలియజేశారు. అనంతరం ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి సీఏఏ, ఎన్ఆర్‌సీని, రామమందిర నిర్మాణాన్ని కూడా స్వాగతించాలని సూచించారు. రామరాజ్య స్థాపనను జీవన్‌రెడ్డి స్వాగతించడంపై ఎంపీ అర్వింద్ హర్షం వ్యక్తం చేశారు. దుబ్బ ప్రజల్లో దేశభక్తి నిండుగా ఉందన్నారు. నాయకులు పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నాగోళ్ల లక్ష్మీనారాయణ, బుస్సాపూర్ శంకర్, భరత్ భూషణ్, రాజు, నిచ్చెంగ్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి వొద్దు.. చదువుకుంటాను!

- పోలీసులను ఆశ్రయించిన బాలిక

మద్నూర్(జుక్కల్): తనకు ఇష్టం లేకున్నా పెళ్లి చేస్తున్నారని మద్నూర్ మండల కేంద్రానికి చెందిన ఓ బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక హాస్టల్‌లో ఉంటూ మండల కేంద్రానికి చెందిన బాలిక తొమ్మిదో తరగతి చదువుతోంది. తనకు చదువుకోవాలని ఉన్నప్పటికీ.. అమ్మ పెళ్లి సంబంధాలు చూస్తోందని, తాను వద్దన్నప్పటికీ వినకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. శుక్రవారం బాలిక కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తామని పోలీసు సిబ్బంది తెలిపారు.

క్యాంపునకు కౌన్సిలర్లు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియా చైర్‌పర్సన్ ఎన్నిక ఈనెల 15న నిర్వహించనున్నట్లు నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తమ కౌన్సిలర్లను శుక్రవారం క్యాంపునకు తరలిస్తోంది. ఒకవైపు హస్తం పార్టీగ చైర్‌పర్సన్ పదవిని దక్కించుకునేందుకు అంతా సిద్ధం చేసుకుంటున్న తరుణంలో.. బీజేపీ సైతం రంగంలోకి దిగింది. ఎలాగైనా మున్సిపల్ పీఠాన్ని కై వసం చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈనేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తమ 27 మంది కౌన్సిలర్లను కాపాడుకునేందుకు క్యాంపునకు పంపిస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్‌లో పదవిని ఇద్దరు ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా వారిని తరలిస్తున్నారు. కౌన్సిలర్లను ఎన్నిక తేదీ రోజు నేరుగా సమావేశానికి తీసుకురావాలని భావిస్తున్నారు.



ఘనంగా రంజాన్

జిల్లా వ్యాప్తంగా గురువారం ముస్లింలు రంజాన్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. పిల్లలు, పెద్దలు నూతన దుస్తులు ధరించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని ఖిల్లా ప్రాంతంలో ఈద్గా వద్ద ప్రార్థనల అనంతరం బయటకు వచ్చిన ముస్లింలకు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీక్ అన్సారీ ప్రార్థనలో పాల్గొన్నారు. ప్రార్థనలకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

– నిజామాబాద్ సిటీ



నగరంలోని ఖిల్లా ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

స్థానిక ఎన్నికలూ టార్గెట్

- పార్లమెంట్ ఎన్నికల్లో పనితీరు ప్రాతిపదికనే పోటీకి అవకాశాలన్న సీఎం
- నామినేటెడ్ పదవులు, ఇందిరమ్మ కమిటీల నియామకంలోనూ..
- లెక్కలేసుకుంటున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు
- ప్రచారపర్వంలో ఉత్సాహంగా ముందుకెళ్తున్న కమల దళం
- పట్టు నిలుపుకునే లక్ష్యంతో బీఆర్‌ఎస్ శ్రేణులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పార్లమెంట్ ఎన్నికల వాతావరణం నడుస్తున్న నేపథ్యంలో ప్రధాన పార్టీల శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికల లెక్కలు వేసుకుంటున్నాయి. లోక్‌సభ ఎన్నికలు ఈవీఎంల ద్వారా నిర్వహిస్తుండడంతో ప్రతి గ్రామంలో ఆయా బూత్‌ల వారీగా సదరు పార్టీలకు వచ్చిన ఓట్ల లెక్కలు కనిపించే పరిస్థితి. దీంతో ఆయా ప్రాంతాల కార్యకర్తలు, నాయకులు పకడ్బందీగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత నెలకొంది. పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగిసిన వెంటనే గ్రామ పంచాయతీ సర్పంచ్, మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజాపరిషత్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించి జూన్ ఆఖరులో లేదా జూలై ప్రారంభంలో ముగించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా ప్రకటించారు.

బుధవారం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశంలో సీఎం ఈ విషయాన్ని వెల్లడించారు. దీంతో ఒక్కసారిగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మరింత అలర్ట్ అయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికలను గురి పెట్టుకుని లోక్‌సభ ఎన్నికల కోసం పనిచేయాలని రేవంత్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో పనితీరునే ప్రామాణికంగా తీసుకుని ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ పదవుల పోటీకి అవకాశాలు కల్పిస్తామని చెప్పడంతో కార్యకర్తలు, నాయకులు ఇప్పటినుంచే కూడికలు, తీసివేతల లెక్కలు వేసుకుంటున్నారు. ఇందులో భాగంగా నాలుగు నెలల కిందట జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆయా నాయకులు, కార్యకర్తలు తమ ప్రాంతాల్లో వచ్చిన ఓట్లను బూత్‌ల వారీగా సరిచూసుకుని ప్లస్‌లు, మైనస్‌లను బేరీజు వేసుకుంటున్నారు.

■ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వరుసగా రెండోసారి గెలిచేందుకు అందరికంటే ముందుగానే ప్రచారం మొదలుపెట్టారు. కేంద్రంలో మరోసారి మోదీ సర్కార్ అనే నినాదంతో పార్టీ శ్రేణులు, అనుబంధ హిందూ సంఘాలు హోరాహోరీగా అన్నట్లుగా క్షేత్రస్థాయిలో దూకుడుగా వెళుతున్నాయి. నిజామాబాద్ నగరపాలక సంస్థతో పాటు ఇతర మున్సిపాలిటీల్లోనూ బీజేపీకి అత్యధిక మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అదేవిధంగా మండలాల్లోనూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ప్రజాప్రతినిధులు గతంలో గెలుపొందారు. ఇటీవల కాలంలో గ్రామస్థాయిలో ప్రాబల్యాన్ని బీజేపీ బలంగా పెంచుకుంది. దీంతో ఈసారి జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ప్రాతినిధ్యం భారీగా పెంచుకోవాలనే లక్ష్యంతో శ్రేణులు ఉత్సాహంగా పనిచేస్తున్నాయి.

■ బీఆర్‌ఎస్ అభ్యర్థి, సీనియర్ నాయకుడు బాజిరెడ్డి గోవర్ధన్ లోక్‌సభ ఎన్నికల బరిలో శక్తివంచన లేకుండా ప్రచారం నిర్వహిస్తున్నారు. స్థానిక ఎన్నికలను ఎదుర్కోవాల్సిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పట్టు నిలుపుకునేందుకు ఆ పార్టీ కార్యకర్తలు గట్టిగా కృషి చేస్తున్నారు.

నామినేటెడ్ పోస్టులు..

రాష్ట్రంలో నాలుగు నెలల కిందటే కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకోగా ఆ పార్టీ నాయకులు నామినేటెడ్ పదవుల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే నామినేటెడ్ పదవుల పంపిణీ మొదలైంది. మరికొన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేయాల్సి ఉంది. నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నవారితో పాటు జెడ్పీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, డీసీసీబీలు, డీసీఎంఎస్‌ల లాంటి ఎలక్టెడ్ పదవులు, మార్కెట్ కమిటీలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్లు తదితర సెలెక్టెడ్ పదవులపై కన్నేసినవారు సైతం లోక్‌సభ ఎన్నికల పోరులో గట్టిగానే శ్రమించాల్సిన ఆవశ్యకత నెలకొందని సీఎం నేరుగానే చెప్పడంతో అంతా అలర్ట్ అయి లెక్కలు వేసుకుంటున్నారు. ఇక ఇందిరమ్మ కమిటీలు, వలంటీర్ల ఎంపికకు సంబంధించి సైతం ముఖ్యమంత్రి పనితీరే ఆధారంగా ఎంపికలు ఉంటాయని ప్రకటించడంతో దిగువ శ్రేణి కేడర్ సైతం ప్రచారపర్వంలో కష్టపడాల్సి వస్తోంది. మరోవైపు నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఇప్పటికే ప్రచారంలో దూకుడుగా ముందుకు వెళుతున్నారు. శ్రేణులు సైతం ఆయనతో ప్రతిరోజూ పాల్గొంటున్నారు.

భక్తిశ్రద్ధలతో గన్‌గోర్



మద్నూర్‌లో గౌరమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

- మద్నూర్‌లో గౌరమ్మలకు మార్వాడీల ప్రత్యేక పూజలు
- మూడో రోజుతో ముగిసిన వ్రతం
- రాజస్థానీ సంప్రదాయం ప్రకారం పూజలు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని మార్వాడీ మహిళలు, యవతులు మూడు రోజులుగా నిర్వహిస్తున్న గన్‌గోర్ వ్రతం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా మహిళలు, యవతులు గౌరమ్మలతో మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా రాజస్థానీ సంప్రదాయం ప్రకారం పాటలు పాడుతూ ఊరేగింపు నిర్వహించారు. స్థానిక బాలాజీ మందిరంలో గౌరమ్మలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతియేటా చైత్ర మాసం శుక్ల పక్ష తృతీయ మాసంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామని మార్వాడీ మహిళలు తెలిపారు. కార్యక్రమం హోలీ పండుగ నుంచి 16 రోజుల పాటు ఎవరి ఇళ్లలో వారు పూజలు చేసుకుంటామని, ఆఖరి మూడు రోజులు సామూహికంగా గౌరమ్మలను ప్రతిష్ఠించి ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు. పెళ్లికాని యువతులు ఈశ్వరుని లాంటి భర్త దొరకాలని, పెళ్లయిన మహిళలు పార్వతిదేవి లాంటి సౌభాగ్యం దొరకాలంటూ వ్రతం ఆచరిస్తామని పేర్కొన్నారు. ఉదయం బాలాజీ మందిరంలో మహిళలు, యువతులు అందరు కలిసి గౌరమ్మలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గౌరమ్మలను స్థానిక చెరువులో నిమజ్జనం చేయడంతో కార్యక్రమం ముగిసింది.



గౌరమ్మలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మార్వాడీ మహిళలు

- అభిప్రాయాలు 8లో..

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్ నాగారం: ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. గురువారం నిజామాబాద్‌లోని దుబ్బ ఎంకే గార్డెన్‌లో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి గెలిచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు నీరు అందక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా కాంగ్రెస్ నాయకులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. నిజామాబాద్ ఎంపీగా ఉన్న అర్వింద్ జిల్లాకు చేసింది ఏమీ లేదన్నారు. పసుపు బోర్డు పేరుతో గెలిచిన అర్వింద్ మళ్లీ అదే పేరుతో గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. మేయర్ నీతూకిరణ్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, సిర్ప రాజు, దారం సాయిలు, సుజిత్ ఠాకూర్, సుదాం రవిచందర్, సత్యప్రకాశ్, ప్రభాకర్ రెడ్డి, మురళి, పంచరెడ్డి సురేష్, సంతోష్, మధుకర్ రెడ్డి, విఠల్, రామకృష్ణ, పవన్ పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ స్కూటి దగ్ధం



కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ఎలక్ట్రిక్ స్కూటీలో నుంచి మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధం అయ్యింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తన ఎలక్ట్రిక్ స్కూటీపై మాయాబజార్ రోడ్‌లో గురువారం వెళ్తుండగా స్కూటిలో నుంచి పొగలు రావడం గమనించి రోడ్డుపైనే నిలిపాడు. సీటు కింద నుంచి పొగలు ఎక్కువై మంటలు చెలరేగాయి.స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పూర్తి వాహనం దగ్ధం అయ్యింది.

వెంటాడుతున్న వాన

డొంకేశ్వర్(ఆర్మూర్): అకాల వర్షాలు రైతులను వెంటాడుతున్నాయి. వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఆకాశం మేఘావృతం కావడంతో కర్షకులు ఆగం అవుతున్నారు. కోసిన పంటను కల్లాల్లో ఆరబెట్టుకోలేని పరిస్థితి నెలకొంది. వర్షం ఎప్పుడు పడుతుందో తెలియక ధాన్యం కుప్పలపై రైతులు టార్పాలిన్లు కప్పి ఉంచుతున్నారు. వడ్లు తడవకుండా కల్లాల వద్దే రైతులు కావలి ఉంటున్నారు. గురువారం కూడా జిల్లావ్యాప్తంగా అక్కడక్కడా చినుకులు పడ్డాయి.



డొంకేశ్వర్ మండలం దత్తాపూర్‌లో ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పి ఉంచిన రైతులు

ఎగుమతులతో ధాన్యానికి ధర

- మద్దతు ధరకు మించి చెల్లిస్తున్న వ్యాపారులు
- ఇతర జిల్లాలకు తరలింపు
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో నత్తనడకన కొనుగోళ్లు
- పది రోజుల్లో సేకరించింది 67,728 మెట్రిక్ టన్నులే



పాలెం నుంచి హైదరాబాద్‌కు ఎగుమతి చేయడానికి లోడ్ చేస్తున్న ధాన్యం

మోర్తాడ్/మోపాల్: జిల్లాలో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వ్యాపారులు ఇతర జిల్లాలకు ఎగుమతి చేస్తున్నారు. సన్నరకాలకు డిమాండ్ ఉండటంతో మద్దతు ధర కంటే ఎక్కువ చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు వారికి విక్రయించేందుకే మొగ్గు చూపుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో సన్నరకం ధాన్యం రూ.2300 వరకు పలుకుతోంది. జిల్లాలో సాగు చేసిన వరిలో సన్న రకాలకే రైతులు ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చారు. సన్న రకాలను తమ వ్యాపారం కోసం మిల్లర్లు కొనుగోలు చేయడానికి మధ్యవర్తులను నియమించుకున్నారు. వారి ద్వారా రైతుల నుంచి ధాన్యం తూకం వేయించి కొనుగోలు చేస్తున్నారు. యాసంగి సీజన్‌లో గతంలో దొడ్డు రకాలనే సాగు చేసేవారు. సన్న రకాలు సాగు చేస్తే తొందరగానే పంట చేతికి వచ్చే రకాలను శాస్త్రవేత్తలు సృష్టించడంతో అన్ని రకాల వంగడాలు అందుబాటులోకి వచ్చాయి. దొడ్డు రకాలను జిల్లాలో 50 శాతం సాగు చేస్తే మరో 50 శాతం సన్న రకాలను సాగు చేశారు. సన్న రకాలకు క్వింటాల్‌కు రూ.2,200 నుంచి రూ.2,300 వరకు వ్యాపారులు ధర చెల్లిస్తున్నారు. సన్న రకాల్లో నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు హైదరాబాద్, కరీంనగర్, మిర్యాలగూడ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. వారం, పది రోజుల తర్వాత సొమ్ము చెల్లించేలా వ్యాపారులు రైతులతో ఒప్పందాలను కుదుర్చుకుంటున్నారు.

కొర్రీలు లేకుండా కొనుగోలు..

రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించేందుకే మొగ్గు చూపుతున్నారు. దళారులు క్వింటాలుకు రూ.2300 నుంచి రూ.2800 వరకు (రకం బట్టి) చెల్లిస్తున్నారు. తరుగు, హమాలీ, రవాణా, ఇతర ఖర్చులేవీ లేకుండా పైన పేర్కొన్న ధరను చెల్లిస్తుండటంతో వారికే విక్రయిస్తున్నారు.

మిల్లర్ల దిద్దుబాటు

ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని సీఎంఆర్ చేసి ఇవ్వడంలో గతంలో రైస్‌మిల్లర్లు నిర్లక్ష్యం వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్‌పై కఠినంగా వ్యవహరించడంతో దిద్దుబాటు చర్యలకు దిగారు. సీఎంఆర్ కింద ఇవ్వాల్సిన బియ్యానికి సంబంధించిన ధాన్యాన్ని దళారుల నుంచి సేకరించి సర్దుబాటు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఎగుమతులతో పాటు, సీఎంఆర్ కోసం మిల్లర్లు కొనుగోలు చేయడంతో ధాన్యానికి ధర పలుకుతోంది.

లక్ష్యం చేరుకోవడం కష్టమే..

రైతులు వ్యాపారులకే ధాన్యం విక్రయించడంతో కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరణ నత్తనడకన సాగుతోంది. జిల్లాలో ఈ సీజన్‌లో ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇతర ప్రాంతాలకు ధాన్యం ఎగుమతి అవుతుండటంతో పాటు జిల్లాలోని రైస్‌మిల్లర్లు సీఎంఆర్ లోటును పూడ్చుకుంటున్నారు. దీంతో ఈ సీజన్‌లో లక్ష్యం నెరవేరడం కష్టమేనని అధికారులు పేర్కొంటున్నారు. గత రెండు సీజన్లలోనూ లక్ష్యం చేరుకోలేదు. జిల్లాలో ఇప్పటి వరకు పదిరోజుల్లో 67,728 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు.

జిల్లాలో 466 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించాలని ఏర్పాట్లు చేయగా, ఇప్పటివరకు 324 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఏప్రిల్ 1 నుంచి ధాన్యం సేకరణ చేపట్టారు. ఇప్పటి వరకు 9,979 మంది రైతుల నుంచి 67,728 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. 360 మంది రైతుల ఖాతాల్లో రూ.5.10కోట్ల నగదు జమ చేశారు.

క్లుప్తంగా

బిల్లు చెల్లింపు మరిచారా?

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఈ ఏడాది జనవరి 11వ తేదీ నుంచి వారం రోజులపాటు ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీ నిర్వహించిన విషయం తెలిసిందే. టోర్నీలో పాల్గొన్న 29 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్‌లు, నిర్వాహకులకు స్థానిక మైనారిటీ రెసిడెన్షియల్ భవనంలో భోజనాలు ఏర్పాటు చేసారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మెస్ యజమాని రాము టోర్నీ ప్రారంభం నుంచి ముగింపు కార్యక్రమం వరకు ప్రతిరోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. సుమారు రూ.7లక్షల వరకు బిల్లు కాగా.. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సభ్యులు, మెస్ కమిటీ సభ్యులు రూ.5 లక్షలు మాత్రమే చెల్లించారు. మిగతా డబ్బులు ఇవ్వకుండా నాలుగు నెలలుగా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని రాము ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. టోర్నీ నిర్వాహకులకు విధులు నిర్వర్తిస్తున్న స్కూళ్లు, వారి ఇండ్ల వద్దకు డబ్బుల కోసం తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని, తనను బెదిరిస్తున్నారని వాపోతున్నాడు. అప్పు చేసి క్రీడాకారులకు భోజనాలు ఏర్పాటు చేశానని, జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే చొరవతీసుకుని తనకు రావాల్సిన బిల్లు ఇప్పించాలని వేడుకుంటున్నాడు.

ఆధ్యాత్మికతపై అవగాహన ఉండాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రతి ఒక్కరికి ధార్మిక ఆధ్యాత్మికతపై అవగాహన ఉండాలని సామాజిక సమరసత తెలంగాణ కన్వీనర్ అప్పల ప్రసాద్‌జీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని హనుమాన్ మందిరంలో భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలపై హిందువులకు ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతీ, సాంప్రదాయాల వెనకనున్న శాస్త్రీయ, ఆధ్యాత్మిక ఆలోచన నేటి తరానికి తెలియజేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కుటుంబాలు మన దేశ వైభవానికి పునాది అన్నారు. పురోహితులు శ్రీపతి రావు పంతులు, దత్తు పంతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వజ్జపల్లి మాజీ సర్పంచ్



సదాశివనగర్(ఎల్లారెడ్డి): వజ్జపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఎర్రం నర్సయ్య గురువారం ఎమ్మెల్యే మద న్ మోహన్ రావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాజీ సర్పంచ్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించా రు. గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎ మ్మెల్యేను కోరినట్లు నర్సయ్య తెలిపారు. అలాగే ఉ త్తునూర్ మాజీ సర్పంచ్ సాయవ్వ భర్త రాములు కూడా చేరారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట్‌లో జరుగుతున్న నల్ల పోచమ్మ జాతర ఉత్సవాలకు ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు హాజరయ్యారు. జాతరలో భాగంగా ఎమ్మెల్యే అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీధర్‌గౌడ్, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, తదితరులున్నారు.

మద్యం కల్తీ చేస్తే కఠిన చర్యలు

ఆర్మూర్‌టౌన్: మద్యాన్ని కల్తీ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, ఇతర రాష్ట్రాల మద్యం రాకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మద్యాన్ని కల్తీచేస్తే వైన్‌షాపులు, బార్‌ల లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

నిబంధనలు గాలికి..

- విచ్చలవిడిగా అక్రమ వెంచర్లు
- పార్కు స్థలాలు మాయం
- బై నంబర్లతో విక్రయం



మానిక్‌బండార్ పరిధిలో వెలిసిన వెంచర్

నిజామాబాద్‌నాగారం: రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమాయకులే టార్గెట్‌గా విచ్చలవిడిగా దందా చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కుతూ ఏర్పాటు చేస్తున్న వెంచర్లలో పార్కు, స్కూల్, కమ్యూనిటీ తదితర అవసరాల కోసం వదిలిన 10శాతం భూమిని సైతం బై నంబర్లు వేసి విక్రయిస్తున్నారు. కార్పొరేషన్, నుడా విలీన గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గత పదేళ్లలో నిజామాబాద్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ వెంచర్లు వందల సంఖ్యలో వెలిశాయి. పలు చోట్ల రోడ్లు వేయకుండానే ప్లాట్లు విక్రయించి అందినకాడికి దండుకుంటున్నారు. నగర పరిధిలో అక్రమంగా వేసిన వెంచర్ల సంఖ్య సుమారు 100కు పైగా ఉంది. పలు వెంచర్లలో పార్కుస్థలాలను మాయం చేయడంతోపాటు రోడ్లను సైతం చిన్నగా చేసేశారు. పాత వెంచర్లలో 10శాతం భూమి ఎక్కడ కూడా కనిపించడం లేదని, బై నంబర్లు వేసి అమ్మేశారని పలువురు పేర్కొంటున్నారు. 2020 టీఎస్‌బీఎస్ చట్టం వచ్చిన తర్వాత వెంచర్లు నిబంధనల ప్రకారం నిర్మిస్తున్నారు. 33ఫీట్ల రోడ్లు వేయడంతోపాటు పార్కు స్థలాలు తదితర అభివృద్ధి పనుల కోసం 10శాతం స్థలాన్ని వదులుతున్నారు. ఇలా నిబంధనల ప్రకారం చేసిన వెంచర్లు 30వరకు మాత్రమే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

నుడా పరిధిలో అంతే..

నుడా పరిధిలో ప్రస్తుతం 74 గ్రామాలు ఉన్నాయి. నుడా ఏర్పాటుకు ముందే విలీన గ్రామాల్లో అక్రమంగా పదుల సంఖ్యలో వెంచర్లు వెలిశాయి. ఇందులో ఎక్కడా నిబంధనలు పాటించింది లేదు. అప్పటి అధికారులు, సర్పంచులు కాసులకు కక్కుర్తి పడడంతో ఎటు చూసినా అక్రమ వెంచర్లే దర్శనమిస్తున్నాయి. విలీన గ్రామాల్లో ఉన్న వెంచర్లలో పార్కు స్థలాలు ఎక్కడ కూడా కనిపించవు.

పర్యవేక్షణ లేకనే..

మున్సిపాలిటీ, నుడా పరిధిలో గతంలో వేసిన అక్రమ వెంచర్లలో కనీస పర్యవేక్షణ లేకపోవడంతోనే ఎవరికి వారు ఇష్టారాజ్యాంగా వెంచర్లు వేసి అందినకాడికి దండుకున్నారు. అందుకే చాలా ప్రాంతాల్లో సరైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులుపడుతూనే ఉన్నారు. ఇప్పటికైనా గతంలో వేసిన వెంచర్లపై కనీస పర్యవేక్షణ ఉంటే ప్రజలకు మేలు జరుగుతుందంటున్నారు. కమిషనర్, ఉన్నతాధికారులు ఈ వైపుగా ఆలోచించి అక్రమ వెంచర్లలో జరిగిన లోపాలను గుర్తించి చర్యలు తీసుకుంటారో లేదో చూడాల్సిందే..

టీఎస్ బీపాస్ తరువాతే నిబంధనలు

గతంలో వేసిన వెంచర్లు ఏ విధంగా వేశారో కూడా తెలియదు. ఎవరికి వారు ఇష్టారాజ్యంగా వేసేశారు. టీఎస్ బీపాస్ చట్టం 2020 వచ్చిన తర్వాతే నిబంధనలు వచ్చాయి. ఎవరు మున్సిపాలిటీ పరిధిలో వెంచర్లు ఏర్పాటు చేసినా నిబంధనలు పాటిస్తున్నారు. అలా 30వరకు అనుమతి పొందిన వెంచర్లు ఉన్నాయి. – కరుణాకర్, టీపీవో

కేవలం నాలుగింటికే నుడా అనుమతి

విలీన గ్రామాలో గతంలో చాలా వెంచర్లు వేశారు. గతంలో అధికారం పంచాయతీలకే ఉండేది. మాకు సంబంధం లేదు. నుడా వచ్చిన తర్వాతా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఓ కమిటీ ఉంటుంది. కమిటీలో ఉన్న అధికారుల పర్యవేక్షణ తర్వాతే అనుమతి ఉంటుంది. అలా నాలుగింటికి మాత్రమే నుడా అనుమతి ఉంది. – శ్యామ్, ఇన్‌చార్జి డీసీపీ

ఆశాజనకంగా నువ్వు ధర

- పాత నువ్వులు క్వింటాల్‌కు రూ.14వేలు
- కొత్త పంటకు ఎక్కువ ధర పలికే అవకాశం
- గతంలో రూ.18,500 పలికిన ధర



సుంకెట్‌లో సాగవుతున్న నువ్వు

మోర్తాడ్(బాల్కొండ): నువ్వు సాగు చేసిన రైతుల ముఖాల్లో నవ్వు కనిపిస్తోంది. పంట కోతకు వచ్చిన దశలో పాత నువ్వులు క్వింటాల్‌కు రూ.14వేల ధర పలుకుతుండగా, ప్రస్తుతం చేతికందే పంటకు మరింత ధర ఎక్కువ ఉండే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. గత సీజన్‌లో ఒక దశలో రూ.18,500 వరకు ధర పలికింది. యాసంగి సీజన్‌కు గాను జిల్లా వ్యాప్తంగా దాదాపు మూడు వేల ఎకరాల విస్తీర్ణయంలో నువ్వు సాగు చేశారు. ఎగుమతులకు డిమాండ్ ఏర్పడటంతో నువ్వు ధర ఆశాజనకంగా ఉందని వ్యాపారులు వెల్లడించారు. కరోనా విపత్కర పరిస్థితుల తరువాత నువ్వులను ఆహారంలో చేర్చడం అందరికీ అలవాటయ్యింది. నువ్వుల నూనె, ఇతర ఉత్పత్తులకు మార్కెట్‌లో మునుపెన్నడూ లేని విధంగా డిమాండ్ పెరిగింది. నువ్వులకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రూ.10వేలు కాగా, మద్దతు ధర కంటే మార్కెట్‌లో ఎక్కువ ధర ఉండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి 5 నుంచి 6 క్వింటాళ్లకుపైగా దిగుబడి వస్తోంది.

వాతావరణంలో మార్పులు..

నువ్వు పంట కోత దశకు చేరుతున్న తరుణంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. 2023 యాసంగి సీజన్‌లో అకాల వర్షాల వల్ల నువ్వు పంట దాదాపు వెయ్యి ఎకరాల్లో నేలరాలిపోయింది. ధర బాగుంది.. మంచి లాభాలను తెచ్చిపెడుతుందని రైతులు నమ్మకంతో ఉన్న సమయంలో వడగండ్ల వర్షం పంటను దెబ్బతీసింది. కొందరు రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారు. ప్రకృతి కన్నెర్ర చేయకపోతే ఈసారి నువ్వులతో మంచి లాభాలను పొందవచ్చని రైతులు ఆశిస్తున్నారు.

పసుపు బోర్డుపై ప్రశ్నించడం అవివేకం

- గెజిట్ నోటిఫికేషన్ వచ్చింది
- బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు పాట్కూరి తిరుపతిరెడ్డి



పాట్కూరి తిరుపతిరెడ్డి

సుభాష్‌నగర్: పసుపు బోర్డు ఎక్కడ ఉందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి జీవన్‌రెడ్డి అనడం అవివేకమని, కేంద్రం, రాష్ట్రపతి గెజిట్ ప్రతిని విడుదల చేసిన తర్వాత కూడా అలా మాట్లాడటం సిగ్గు చేటని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పాట్కూరి తిరుపతిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పసుపుబోర్డు ఏర్పాటుపై ఇప్పటికే గెజిట్ నోటిఫికేషన్ వచ్చిందని, రాజపత్రాన్ని చదివితే బోర్డు ఎక్కడవుతుందో అర్థమవుతుందని సూచించారు. ఎంపీ అర్వింద్ కృషి కారణంగానే పసుపు ధర పెరిగిందన్నారు. దేశవ్యాప్తంగా పసుపు సాగు విస్తీర్ణం పెరిగిందని, 16 రాష్ట్రాల్లో సాగు చేస్తారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎగుమతి, దిగుమతులను సరళతరం చేయడంతో ధర పెరిగిందన్నారు. పసుపు బోర్డు కేవలం అర్వింద్ వల్లే సాధ్యమైందని, రాష్ట్ర ప్రభుత్వపరంగా సహకరించాల్సింది పోయి విమర్శలు చేయడం సరికాదన్నారు.

పసుపు సాగులో తెలంగాణ దేశంలోనే మొదటిస్థానంలో ఉండేదని, ఇక్కడి ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా రెండో స్థానానికి పడిపోయిందన్నారు. షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని బాండ్ పేపర్ రాసిచ్చే దమ్ము జీవన్‌రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. అబద్ధపు ప్రచారం చేస్తూ అనవసర విమర్శలు చేయొద్దని హితవు పలికారు. నిజామాబాద్ పార్లమెంట్‌లో మరోసారి బీజేపీ జెండా ఎగరడం ఖాయమని తిరుపతిరెడ్డి ధీమా వ్యక్తంచేశారు.

ఘనంగా రంజాన్



ముస్లింలు పవిత్రమైన రంజాన్ పండుగను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఒకరికొకరు ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్




శుభాకాంక్షలు తెలుపుతున్న ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి




బాలుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మేయర్ సుజాత, కాంగ్రెస్ నాయకులు

కాలువల ద్వారా నీటి విడుదల



ఎస్సారెస్పీపై అధికారులతో కాంగ్రెస్ నాయకులు



ప్రవహిస్తున్న కాకతీయ కాలువ

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాకతీయ, లక్ష్మి, సరస్వతి కాలువల ద్వారా ఆఖరు తడి కోసం ప్రాజెక్టు అధికారులు నీటి విడుదలను గురువారం ప్రారంభించారు. నీటి మట్టం తక్కువగా ఉండడంతో గతనెల 31న అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. ఆఖరు తడి కోసం కనీసం వారంరోజుల పాటు నీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేయడంతో స్పందించిన పాలకులు, అధికారులు స్పందించారు. 3 టీఎంసీల నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. కాకతీయకాలువ ద్వారా 5వేలక్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కుల నీటి విడుదలను ప్రారంభించారు. నీటి విడుదల సందర్భంగా ప్రాజెక్టు వద్దకు వచ్చిన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తోందన్నారు. ఆయకట్టు రైతుల పంటలను గట్టెక్కించాలని ప్రభుత్వం నీటి విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ప్రతి నీటి చుక్కనూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లక్ష్మి లిఫ్టు ద్వారా..

లక్ష్మి కాలువ ద్వారా నీటిని విడుదల చేసేందుకు తగిన స్థాయిలో నిలువ లేకపోవడంతో కాలువ హెడ్ రెగ్యులేటర్ ఎత్తిపోయింది. ప్రాజెక్టులో 1045 అడుగుల నీటి మట్టం వద్ద నిర్మించిన లిఫ్టు ద్వారా నీటి విడుదలను ప్రస్తుతం ప్రారంభించారు. లిఫ్టు నిర్మాణం నుంచి ఇప్పటికి వరకు మూడు సార్లు మాత్రమే నీటి విడుదల చేపట్టారు. 2018, 2019లో, ప్రస్తుతం నీటిని విడుదల చేస్తున్నారు.

సేవాలాల్ భక్తుల పూజలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): యాచారం గ్రామంలో గురువారం సేవాలాల్ మహరాజ్ దీక్షాపరులకు మాజీ సర్పంచ్ లతారమేశ్ భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్‌రావు, విండో చైర్మన్ ప్రభాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించలేదని ఇంటికి తాళం

- అద్దెకు ఉన్నవారిని బయటికి పంపిన అధికారులు
- రూ.28వేలు బకాయిపడ్డ ఇంటి యజమాని



నిజామాబాద్ నాగారం: ఆస్తి పన్ను చెల్లించలేదని అధికారులు ఇంటికి తాళం వేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నగరంలోని ఎల్లమ్మగుట్ట కాలనీలో ఇంటి నంబర్ 5–10–46, పీటీఐ నంబర్ 1046009439 గల ఇల్లు ఎండల నర్సింలు పేరుతో ఉంది. ఆయన ఆ ఇంటిని ఇద్దరు కుమారులు సురేందర్, సుధాకర్‌లకు పంచి ఇచ్చారు. వీరు వేరే ప్రాంతాల్లో ఉంటూ ఆ ఇంటిని తమ దగ్గరి బంధువు రమేశ్‌కు అద్దెకు ఇచ్చారు. రమేష్ భార్యపిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. ఇంటి యాజమాని సురేందర్ ఇంటి పన్ను కట్టడంలో జాప్యం చేశారు. మార్చి 31లోపు పన్ను చెల్లించాలి. ఈ ఇంటిపై ఇప్పటి వరకు సుమారు రూ.28వేల ఆస్తి పన్ను ఉంది. గత నెల 30న రెవెన్యూ అధికారులు ఇంట్లో ఉన్న వారిని బయటకు పంపి తాళం వేశారు. పది రోజులుగా తాళం వేసే ఉంది.

పేదలపైనే ప్రతాపం..

నగరంలో రూ.వేలల్లో ఆస్తి పన్నులు చెల్లించని వారిపై చర్యలు తీసుకుంటున్న మున్సిపల్ అధికారులు.. రూ.లక్షలు, రూ.కోట్లల్లో ఉన్న వ్యాపారులను మాత్రం ఏమనడం లేదు. పేదల ఇళ్లకు వెళ్లి వసూలు చేస్తున్న అధికారులు.. బడా వ్యాపారులు, దుకాణాదారుల వద్దకు మాత్రం అలా వెళ్లి ఇలా వస్తున్నారు. వాళ్లు కోర్టుకు వెళ్లడంతో ఆ వైపు కన్నెత్తి చూడరు. ఇలా హైదరాబాద్ రోడ్డులో రెండు పెద్ద హోటళ్లలో సుమారుగా రూ.11కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి.

నిబంధనలకు విరుద్ధం

దుకాణాదారులు ఆస్తి పన్ను చెల్లించకుంటే సీజ్ చేసే అధికారం ఉంది. ఇళ్లలో నివసించే వారు పన్ను చెల్లించకుంటే ఇంటిలోని వస్తువులు తీసుకెళ్లిన ఘటనలు ఉన్నాయి. ఎక్కడ కూడా ఇంటికి తాళం వేసిన ఘటనలు లేవు. మున్సిపల్ రెవెన్యూ చట్టం ప్రకారం ఇళ్లకు తాళం వేయాలని లేదని అధికారులే చెబుతున్నారు. కొంతమంది బిల్ కలెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు అత్యుత్సాహ చూపించడంపై ప్రజలు మండిపడుతున్నారు.

మద్నూర్‌లో భక్తిశ్రద్ధలతో గన్‌గోర్..



గౌరమ్మను ఎత్తుకున్న మార్వాడీ యువతులు



గౌరమ్మకు పూజలు చేస్తున్న మార్వాడీలు



మద్నూర్‌లో రావి చెట్టుకు పూజలు..

రాజస్థానీ సంప్రదాయం ప్రకారం మార్వాడీ మహిళలు మూడు రోజులపాటు భక్తి శ్రద్ధలతో ఆచరించిన గన్‌గోర్ వ్రతం గురువారం ముగిసింది. మహిళలు, యువతులు గౌరమ్మను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. – మద్నూర్(జుక్కల్)

వ్రతం పవిత్రమైంది



ప్రతి ఏడాది మార్వాడీల ఆధ్వర్యంలో నిర్వహించే గన్‌గోర్ వ్రతం పవిత్రమైంది. వ్రతం వల్ల మహిళల సౌభాగ్యాలు, పెళ్లికాని యువతులకు ముఖ్యమైంది. రాజస్థానీ సాంప్రదాయ బద్ధంగా వ్రతాన్ని మూడు రోజుల పాటు నిర్వహిస్తాం. –శీతల్ కాకాని, మద్నూర్

సౌభాగ్యం కోసం..



మార్వాడీలు ప్రత్యేకంగా జరిపే గన్‌గోర్ వ్రతం వల్ల పెళ్లి జరిగిన మహిళలకు పార్వతిదేవి లాంటి సౌభాగ్యం కలగాలని పూజలు నిర్వహిస్తాం. ఈ గౌరమ్మ వ్రతాన్ని మనస్సుతోపూజిస్తే అనుకున్నవి జరుగుతాయి. –రేషు శర్మ, మద్నూర్

మంచి భర్త దొరకాలని..



మార్వాడీల్లో పెళ్లి కాని యువతులకు ఈశ్వరుని లాంటి మంచి భర్త దొరకాలంటూ వ్రతాన్ని నిర్వహిస్తాం. రాజస్థానీ సాంప్రదాయం ప్రకారం భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తాం. –జయశ్రీ పారిక్, మద్నూర్

ప్రతి సంవత్సరం నిర్వహిస్తాం



ప్రతియేటా గన్‌గోర్ వ్రతాన్ని నిర్వహిస్తాం. వ్రతం మహిళలకు, యువతులకు చాలా ముఖ్యమైంది. ప్రతియే టా అందరం కలిసి ఆనందంగా వ్రతాన్ని నిర్వహించి ఉపవాసాలు ఉంటాం. –శీతల్ తివారి, మద్నూర్

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నవీపేట: అలీసాగర్ లిఫ్టు కాలువలో మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. రెంజల్ మండలం బోర్గాం గ్రామానికి చెందిన చంద్రకళ(45) బుధవారం కనిపించకుండాపోయిందన్నారు. గురువారం కోస్లీ శివారులోని అలీసాగర్ లిఫ్టుకాలువలో సదరు మహిళ మృతదేహం లభించిందని,ఒంటిపై గాయాలున్నాయన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందినట్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోచంపాడ్ పుష్కరఘాట్‌లో మృతదేహం

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ గోదావరిలో గుర్తుతెయని మహిళ మృతదేహం గురువారం లభ్యమైంది. సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయస్సున్న మహిళ మృతదేహం పుష్కరఘాట్ వద్ద కనిపించడంతో స్థానికులు సమాచారం అందించారని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని బయటికి తీయించామన్నారు. మృతురాలి సంబంధీకులు ఎవరైనా ఉంటే ఆర్మూర్ రూరల్ సీఐ (87126 59859),మెండోరా ఎస్సై (87126 59864)నుసంప్రదించాలని సూచించారు.

ఎన్నికల సమయంలో నిబంధనలు పాటించాలి

టీబీపేట: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనదారులు నిబంధనలు పాటించాలని, అధిక మొత్తంలో నగదును తరలించరాదని ఎస్సై ప్రభాకర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి వాహనదారులకు పలు సూచనలు కల్పించారు. వాహనాల్లో అనుమతులు లేకుండా నగదును, కానీ ఇతర సామగ్రిని కానీ తరలించొద్దని పేర్కొన్నారు. అంతే కాకుండా హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు జరిమానాలు విధించారు. ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్ సాయిబాబా, కానిస్టేబుళ్లు నవీన్, శ్రీకాంత్, అనిల్ తదితరులు ఉన్నారు.

వేధింపులపై ఫిర్యాదు

నిజామాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో ఉర్దూ మీడియం టీచర్ వేధిస్తున్నారని ఓ విద్యార్థిని డీఈవో దుర్గాప్రసాద్‌కి రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేసింది. వేధింపులను భరించలేక వేరే కళాశాలకు వెళ్తున్నట్లు తెలిపింది. విద్యార్థిని ఫిర్యాదు నేపథ్యంలో విచారణకు ఆదేశించిన డీఈవో.. మండల విద్యాశాఖ అధికారి రామారావును విచారణ అధికారిగా నియమించారు. కళాశాలలో సోమవారం విచారణ చేపట్టనున్నట్లు రామారావు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

ఎడపల్లి (బోధన్) :మండల పరిధిలో గురువారం చోటుచేసుకున్న రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని ఠాణాకలాన్‌కు చెందిన ముగ్గురు బైక్‌పై వెళ్తుండగా అలీసాగర్ వైపు నుంచి ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ మహిళతోపాటు సాయిలు, శ్రీనివాస్ అనే వ్యక్తులకు గాయాలయ్యాయి. బాధితులను స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎదురుగా వచ్చి ఢీకొట్టిన బైక్‌పై ఉన్నవారు పరారయ్యారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్..

మండలంలోని ఎమ్మెస్సీ ఫారం గ్రామం వద్ద బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కోటగిరి మండలం ఎత్తొండకు చెందిన కేశవ్ అనే యువకుడి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించి, క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.